## క్లుప్తంగా

### మర్యాదపూర్వకంగా..



కావలి : మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ మత్స్యకార నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బెంగళూరులోని నివాసంలో రామిరెడ్డిని కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కావలి నియోజకవర్గంలోని పరిస్థితులపై చర్చించారు.

### ఉచితంగా తాగునీటి సరఫరా

అల్లూరు: కేఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి ఆదేశాల మేరకు తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ఉచితంగా ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తున్నామని ఆ ఫౌండేషన్ సభ్యులు కమల్‌సింగ్, జోసఫ్ తెలిపారు. మండలంలోని ఆర్‌ఆర్ కాలనీ, క్రిస్టియన్‌పేట, ఇస్కపల్లి రోడ్డు, తదితర ప్రాంతాల్లో కేఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా ట్యాంకర్లతో తాగునీటిని బుధవారం సరఫరా చేశారు. మండల పరిధిలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తమకు విన్నవిస్తే సరఫరా చేస్తామని తెలిపారు.

### వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా



ఆత్మకూరురూరల్: జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సరఫరాను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్ తెలిపారు. కరటంపాడు, వాశిలి సబ్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన ఐదు కొత్త విద్యుత్ ఫీడర్లను బుధవారం ఆయన ప్రారంభించారు. గృహ, వ్యవసాయ అవసరాలకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కొత్త ఫీడర్లను ఏర్పాటు చేశామని తెలిపారు.డీఈఈలు శ్రీనివాసులు, పరంధామయ్య, ఏడీఈలు కృష్ణారెడ్డి, నాయక్, జేఈలు హరికృష్ణ, సుబ్బారెడ్డి, సునీత, జమీలాబేగం పాల్గొన్నారు.

### విద్యార్థులకు కంటి పరీక్షలు



కలిగిరి: కుమ్మరకొండూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు జలదంకి పీహెచ్‌సీ నేత్ర వైద్యుడు కే వెంకటసుబ్బయ్య కంటి వైద్యపరీక్షలను బుధవారం నిర్వహించారు. ఐదుగురికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి అద్దాలు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉమాశంకర్‌శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సోమశిల జలాశయంలో మృతదేహం



ప్రభాకర్(ఫైల్)

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి గ్రామానికి చెందిన బద్దిక నరసింహులు, ప్రమీల దంపతుల కుమారుడైన ప్రభాకర్ (37) ఇతర రాష్ట్రాల్లో తాపీమేస్త్రిగా పని చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవాడు. ఇతడికి వివాహం కాలేదు. ఏడాది క్రితం ఆరోగ్యం దెబ్బతింది. అప్పట్నుంచి ప్రభాకర్ ఇంటి వద్దనే ఉంటూ వైద్యం చేయించుకుంటున్నాడు. మూడ్రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లాడు. బంధువుల దగ్గరకు వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. అతను తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం జలాశయంలో ప్రభాకర్ మృతదేహాన్ని గుర్తించారు. దానిని పోలీసులు వెలికి తీయించారు. తొలుత గుర్తుతెలియని వ్యక్తిగా భావించారు. కాగా అతడి వద్ద ఫోన్ నంబర్ బుక్ దొరకడంతో పూర్తి వివరాలు లభ్యమయ్యాయి. సమాచారం అందుకున్న బాధిత తల్లిదండ్రులు ఇక మాకు దిక్కెవరంటూ రోదిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సోమశిల ఎస్సై అనూష తెలిపారు. ప్రమాదవశాత్తు పడి మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నారు.

### ఇఫ్తార్ విందు

ఆత్మకూరు: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లిం సోదరులకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి బుధవారం ఇఫ్తార్ విందు అందజేశారు. టెక్కె సమీపంలోని మదీన మసీదు, ఏపీఎస్‌ఆర్‌కాలనీలోని జలీల్ మసీదు, తదితర ప్రాంతాల్లో ఇఫ్తార్ విందు అందజేశారు. ఆయనకు ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట కేవీ శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, గోవిందరెడ్డి, తదితరులు ఉన్నారు.

### దుర్గం అటవీ ప్రాంతానికి హద్దుల ఏర్పాటు

ఉదయగిరి: ఉదయగిరి అటవీ శాఖ రేంజ్ పరిధిలో ఉన్న దుర్గం అటవీ ప్రాంతానికి అటవీశాఖ అధికారులు బుధవారం హద్దులు ఏర్పాటుచేశారు. స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో హద్దులు లేకపోవడంతో హద్దు రాళ్లు నాటారు. దుర్గం అటవీ ప్రాంతానికి సంబంధించి అన్ని ప్రాంతాల్లో హద్దులు ఏర్పాటు చేస్తునట్లు రేంజ్ అధికారి కుమారరాజా తెలిపారు. ఎఫ్‌బీఓ లక్ష్మీప్రసన్న, ఏబీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర



సోమశిల: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ దేవసేనమ్మ



ఆత్మకూరురూరల్: కరటంపాడులో అవగాహన కల్పిస్తున్న ఏఓ

బిట్రగుంట: రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధరను అందించి అండగా నిలిచేందుకు విరివిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. బోగోలు పంచాయతీ చెంచులక్ష్మీపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలోని రికార్డులు, రైతులకు కల్పిస్తున్న వసతులు, తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దళారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసి రైతులకు కనీస మద్దతు ధరను అందించే లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కొనుగోలు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదైన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు వివరించారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు ఉన్నారు.

ఆత్మకూరురూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కిషోర్‌బాబు కోరారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కరటంపాడు, బోయలచిరివెళ్ల గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. రైతులకు కొనుగోలు కేంద్రాలపై అవగాహన కల్పించారు. మండలంలో పదకొండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిండికేట్ ఫార్మర్స్ సొసైటీతో పాటు వెన్నవాడ, బట్టేపాడు పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నామన్నారు. పుట్టి ధాన్యానికి రూ.19720 చొప్పున మద్దతు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. వీఏఏలు యస్థాని, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ మాట్లాడుతూ పంట నమోదు, ఈకేవైసీ చేయించుకున్న ప్రతిరైతు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని తెలిపారు. మండలంలోని పదకొండు రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు దళారులను నమ్మి నష్టపోవద్దని సూచించారు. ఏఓ శ్రీధర్‌రెడ్డి, సొసైటీ సిబ్బంది ప్రభాకర్, నాగేంద్ర, వీఏఏలు యశోద, మున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

## బలవంతపు భూసేకరణను ప్రతిఘటిస్తాం

- ఈ నెల 17న ఆర్డీఓ కార్యాలయం ముట్టడి
- వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



ప్రజలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కావలి : కావలి రూరల్ మండలం ఆనెమడుగు రెవెన్యూ పరిధిలో బలవంతపు భూసేకరణను అధికారులు ఆపకపోతే ప్రతిఘటిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం ఆనెమడుగు రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనెమడుగు రెవెన్యూ పరిధిలోని ఆరు గ్రామాల్లో బీపీసీఎల్, సోలార్ కంపెనీల కోసం భూములు సేకరిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం పత్రిక ప్రకటనను జారీ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. మీరు భూములు ఇవ్వకపోతే మీకు ఎటువంటి నష్టపరిహారం రాదని ఆర్డీఓ, అధికారులు వచ్చి ప్రజలను భయపెట్టి బలవంతంగా భూములు తీసుకోవడానికి పూనుకోవడాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఆయా గ్రామాల్లో కావలి కాలువ కింద రెండు పంటలు పండే 27వేల ఎకరాల సారవంతమైన భూములు ఉన్నాయని తెలిపారు . ఈ భూములపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. బీపీసీఎల్ కంపెనీని ఏర్పాటు చేస్తే కాలుష్యంతో పంటలు పండవన్నారు. భూ సేకరణ వల్ల వ్యవసాయంపై ఆధారపడిన రైతులు, కార్మికులు, వృత్తిదారులు పనులు లేక వలసలు పోవాల్సిన పరిస్థితులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల 2013 చట్టం ప్రకారం ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుని పరిశ్రమలకు భూములు తీసుకోవాలే తప్ప బలవంతంగా తీసుకోవడానికి ఉపక్రమిస్తే మార్చి 17న కావలి ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళ పుల్లయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి, జొన్నలగడ్డ వెంకమరాజు, మారుపూడి రాధాకష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరి కొండపై మంటలు

ఉదయగిరి: ఉదయగిరి కొండపై ఉన్న అటవీ ప్రాంతంలో బుధవారం తెల్లవారుజాము నుంచి మంటలు రాజుకుంటున్నాయి. ఎవరైనా నిప్పు రాజేసి ఉండొచ్చని భావిస్తున్నారు. మంటలతో అటవీ ప్రాంతంలోని మూగజీవాలు ఇబ్బందిపడే అవకాశముంది. అటవీ శాఖ అధికారులు స్పందించి మంటలను అదుపు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## పొరుగు మద్యంపై గట్టి నిఘా

ఆత్మకూరు: జిల్లా వ్యాప్తంగా పొరుగు మద్యం రవాణాపై గట్టి నిఘా ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తున్నామని జిల్లా ఎక్సైజ్ శాఖ ఏసీ దయాసాగర్ తెలిపారు. ఆత్మకూరు ఎక్సైజ్ కార్యాలయాన్ని ఏఈఎస్ జగదీష్‌రెడ్డితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. గతేడాది అక్టోబరు నుంచి మార్చి 1వ తేదీ వరకు ఆత్మకూరు ఎక్సైజ్ పరిధిలో పట్టుబడిన కేసుల వివరాలను సీఐ ఆర్వీ రమణమ్మను అడిగి తెలుసుకున్నారు. ఏసీ దయాసాగర్ మాట్లాడుతూ ఆత్మకూరు ఎక్సైజ్ పరిధిలో 58 కేసుల్లో 54 మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 822 అక్రమ మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు వివరించారు. గంజాయిని అరికడుతున్నామని తెలిపారు. బెల్టు దుకాణాలపై కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. అనంతరం ఎక్సైజ్ అధికారులతో కలిసి మద్యం దుకాణాలను తనిఖీ చేశారు.

## రూ.4.23లక్షల రికవరీకి ఆదేశం



చేజర్ల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదికను బుధవారం నిర్వహించారు. తొలుత సామాజిక తనిఖీ బృందాలు పంచాయతీల వారీగా ఉపాధి పనుల్లో గుర్తించిన అవకతవకలను చదివి వినిపించాయి. అనంతరం డ్వామా పీడీ గంగాభవాని అవకతవకలపై విచారణ జరిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.6.44 కోట్లతో ఉపాధి పనులు చేపట్టగా, రూ.4.23 లక్షల మేర అవినీతి జరిగినట్లుగా గుర్తించి ఫీల్డ్‌అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. ఏపీడీ శంకరనారాయణ, అంబుడ్స్‌మెన వెంకట్‌రెడి, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ విజయలక్ష్మి, క్వాలిటీ కంట్రోలర్ సతీష్, ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ పేర్ల పార్థసారథి, ఎంపీడీఓ విజయలలిత, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## సూక్ష్మ నీటి పారుదల పథకంపై అవగాహన



చేజర్ల: చిన్న,సన్నకారు రైతులకు సూక్ష్మ నీటి పారుదల పథకం కింద సబ్సిడీపై డ్రిప్, స్ప్రింకర్లను అందజేస్తున్నామని ఏపీఎంఐపీ అధికారి శ్రీనివాసులు తెలిపారు. చేజర్లలోని రైతు సేవా కేంద్రంలో సూక్ష్మ నీటి పారుదల పథకంపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 5వేల ఎకరాల్లో డ్రిప్ సౌకర్యం కల్పించాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 3,500 ఎకరాల్లో కల్పించామని తెలిపారు. రైతులు ముందుకొస్తే 90 శాతం రాయితీపై డ్రిప్, 50శాతం రాయితీపై స్ప్రింక్లర్లను అందజేస్తున్నామన్నారు. ఏఓ శశిధర్, ఉద్యాన అధికారి లక్ష్మి, మైక్రో ఇరిగేషన్ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పరామర్శ



ప్రభాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విక్రమ్‌రెడ్డి



మల్లీశ్వరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట/సంగం: సంగం, అనుమసముద్రంపేట మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. తొలుత సంగం మండల చెన్నవరప్పాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పేట మల్లికార్జునను పరామర్శించారు. ఇటీవల మల్లికార్జున భార్య మల్లీశ్వరి అనారోగ్యంతో మృతి చెందింది. ఈ నేపథ్యంలో మల్లికార్జునను పరామర్శించి సానుభూతి తెలిపారు. కాగా చెన్నవరప్పాడుకు వెళ్తున్న క్రమంలో తలుపూరుపాడు వద్ద విక్రమ్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కరిముల్లా తన అనుచరులతో కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం హసనాపురంలో జరిగిన రాజవోలు సొసైటీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కల్లూరు ప్రభాకర్‌రెడ్డి ఉత్తరక్రియల్లో విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. కల్లూరు చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట సంగం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పులగం శంకర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎం దేవసహాయం, మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాధరెడ్డి, ఏఎస్‌పేట ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, సర్పంచ్‌లు మంజుల, మానికల చందన్ కుమార్, తుంగా కార్తీక్‌రెడ్డి, శేషయ్య, గుండాల బాల చంద్రారెడ్డి, సూరి మదన్‌మోహన్‌రెడ్డి, ఫణికుమార్ రెడ్డి, సూరా శ్రీనివాసులరెడ్డి, పులిమి రమేష్‌రెడ్డి, సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి, కో ఆప్షన్ సభ్యులు సంధాని, కోటిరెడ్డి, ముజీర్‌ఖాన్, గంగవరపు శ్రీనివాసులునాయుడు, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, ఆంధ్రా సుబ్బారెడ్డి, బిజివేముల పిచ్చిరెడ్డి, తదితరులు ఉన్నారు.

**ఆశీర్వచనం**

మండలంలోని పెద్దబ్బీపురంలో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సూరా బలరామిరెడ్డి కుమారుడు సూరా నారసింహారెడ్డి వివాహ నలుగు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి హాజరై వరుడిని ఆశీర్వదించారు. అలాగే పార్టీ నాయకుడు అల్లంపాటి కొండారెడ్డి ఇంటికి వెళ్లి ఇటీవల వివాహం చేసుకున్న కుమారుడు మహేష్‌రెడ్డి, మౌనిక దంపతులను ఆశీర్వదించారు.

## అక్రమ నిర్మాణం కూల్చివేత

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో మండల పరిషత్ కార్యాలయ ప్రహరీని ఆనుకుని ఉన్న 15 అంకణాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా చేపడుతున్న కట్టడాన్ని రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి సెంట్రింగ్ పనులు చేస్తున్న వ్యక్తికి డీ-ఫారం పట్టా ఉందని ప్రభుత్వ స్థలాన్ని రూ.3 లక్షలకు విక్రయించి అందులో రూ.2 లక్షలు తీసుకున్నట్లుగా సమాచారం. అయితే వాస్తవంగా ఈ స్థలానికి ఎలాంటి పట్టాను రెవెన్యూ అధికారులు ఇవ్వలేదు. స్థానికులు తహసీల్దార్ హమీద్‌కు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ సిబ్బంది మంగళవారం పరిశీలించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. బుధవారం కట్టడాన్ని కూల్చివేయడంతో డబ్బులు పోగొట్టుకున్న బాధితుడు లబోదిబోమంటున్నాడు.


## ఘనంగా పీటర్‌పాల్ మినిస్ట్రీస్ వార్షికోత్సవం



రక్తదానం చేస్తున్న దాతలు


కావలి : పట్టణంలోని వెంగళరావునగర్‌లోని పీటర్ పాల్ మినిస్ట్రీస్‌లో 8వ వార్షికోత్సవం, మినిస్ట్రీస్ కన్వీనర్ దేవరకొండ పీటర్ పాల్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశాలను ప్రారంభించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సహకారంతో మెగా రక్తదాన, వైద్య శిబిరాలను నిర్వహించారు. పీటర్ పాల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, దళిత, గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ దేవరకొండ సుధీర్‌బాబుతో పాటు పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తొలుత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లకు, పేదలకు వస్త్రదానం, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దేవరకొండ సుధీర్‌బాబు మాట్లాడుతూ ఏటా పీటర్ పాల్ మినిస్ట్రీస్ వార్షికోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ఈ ఏడాది ఉచిత వైద్యశాలను ప్రారంభించడంతో పాటు రక్తదాన శిబిరం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పేదలు ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయరాణి, పాడేటి థామస్, మినిస్ట్రీస్ సభ్యులు రెవరెండ్ జయపాల్, ప్రభుదాస్, ఏసుబాబు, కృపారావు, ఇమ్మానుయేలు, కలికి రాజేంద్ర, నెల్లూరు క్రిస్టియన్ నాయకులు బర్నాబాస్, సురేంద్ర, రవి, తదితరులు పాల్గొన్నారు.

## మిరపలో సస్యరక్షణ చర్యలు



కావలి : దగదర్తి మండలం నారాయణపురంలో సాగుచేసిన మిరప పంటను కావలి ఉద్యాన అధికారిణి ఎం సుధామయి బుధవారం పరిశీలించారు. మిరపలో నల్ల తామర పురుగు, నల్లిని గుర్తించి సస్యరక్షణ చర్యలను సూచించారు. నల్లతామర పురుగుల నియంత్రణకు వేపనూనె, కానుగ నూనెలను పిచికారీ చేయాలని సూచించారు. ఎకరాకు పసుపు రంగు అట్టలను 15 నుంచి 25 వరకు అమర్చడం వల్లతెల్లదోమ, తామర పురుగు ఉధృతిని తగ్గించవచ్చని చెప్పారు. తామర పురుగు నివారణకు లీటర్ నీటికి థయామీథాక్సామ్ 25 శాతం డబ్ల్యూజీ 0.5 మి.లీ, ప్రొఫెనిల్ 1.5-2 గ్రాములు, స్పినోసాడ్ 0.3మి.లీ, అసెటామాప్రిడ్ 0.2-0.3 మి.లీను మార్చి మార్చి పిచికారీ చేయాలని సూచించారు. నల్లి నివారణకు హెక్సిథియాజోల్ 5.45% ఈసీ 0.8-1 మి.లీ, ప్రోపర్ గైట్ 57 శాతం ఈసీ 3 మి.లీ, స్పైరోమేసిఫిన్ , టోలీఫెన్ పైరాడ్ 0.3 మి.లీ, ఫెన్‌ప్రోపెత్రిన్ 30 శాతం ఈసీ 0.5 మి.లీ, ప్రోపర్ గైట్ 2 మి .లీ మందులను మార్చి మార్చి పిచికారీ చేయాలి తెలిపారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఉదయగిరి: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునీత



అనుమసముద్రంపేట: కేజీబీవీలో..

ఉదయగిరి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సునీత అన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయగిరిలోని సెయింట మేరీస్ పాఠశాలలోని విద్యార్థినులతో సీడీపీఓ సునీత ప్రత్యేక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ప్రపంచంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, సాధించిన విజయాలను వివరించారు.అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తేజస్విని, షాను, రత్న, తదితరులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీ విజయలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఎస్‌పేటలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలోని విద్యార్థినులకు బుధవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం కిశోర బాలికలతో ర్యాలీ నిర్వహించారు. కేజీబీవీ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మమ్మ, అంగన్‌వాడీలు కే విజయలక్ష్మి, సుశీలమ్మ జీ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలం సంజీవనగరంలోని ప్రాథమిక పాఠశాలలో గర్భిణులు, బాలింతలు, మహిళలతో ఐసీడీఎస్ అనంతసాగరం ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మావతి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ ం నేపథ్యంలో మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నిర్మల, పద్మ పాల్గొన్నారు.

## ప్రభుత్వ సర్వేలను పారదర్శకంగా చేపట్టాలి



బ్రాహ్మణక్రాకలో సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న మోహన్‌రావు

ఉదయగిరి(వింజమూరు)/కలిగిరి/ జలదంకి: ప్రభుత్వ సర్వేలను సచివాలయ సిబ్బంది పారదర్శకంగా చేపట్టాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు సూచించారు. ఆయన వింజమూరు, జలదంకి, కలిగిరి మండల పరిషత్ కార్యాలయాలను బుధవారం తనిఖీ చేశారు. బ్రాహ్మణక్రాక, కలిగిరి లోని గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం సూచించిన ఆరు సర్వేలను బాధ్యతతో చేపట్టాలని సూచించారు. ఆధార్ వెరిఫికేషన్, చిన్నారుల ఆధార్ నమోదు, హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వేల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడంతో పాటు గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎంపీడీఓలు బ్రహ్మయ్య, శ్రీనివాసరెడ్డి, ప్రత్యూష రెడ్డి, జలదంకి మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీధర్, బీజేపీ జిల్లా కార్యదర్శి మారెళ్ల బ్రహ్మారెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## హైలెవల్ కెనాల్‌కు నిధులు కేటాయించాలని వినతి

మర్రిపాడు: విజయవాడలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును సోమశిల హైలెవల్ కెనాల్ సాధనా సమితి బాధ్యులు బుధవారం కలిశారు. హైలెవల్ కెనాల్‌కు నిధులు కేటాయించి పూర్తి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఆత్మకూరు, అనంతసాగరం, మర్రిపాడు, ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు మండలాలకు సాగు, తాగునీటిని అందించేందుకు 2012లో ప్రభుత్వం సోమశిల హైలెవల్ కెనాల్‌ను మంజూరు చేసిందని తెలిపారు. రూ.1520 కోట్లతో రెండు ఫేజ్‌లలో కాలువను నిర్మించాల్సి ఉండగా తొలి దశలో రూ.850 కోట్లతో కొంత మేర పనులు చేపట్టారని తెలిపారు. ఆ తరువాత పనులు చేపట్టలేదని విన్నవించారు. హైలెవల్ కెనాల్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరారు.